క్లుప్తంగా

నేడు ధవళేశ్వరంలో స్వచ్ఛ భోగి

ధవళేశ్వరం: స్థానిక జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం ఉదయం 7 గంటలకు స్వచ్ఛ భోగి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌరసంబంధాల, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణు గోపాలకృష్ణ తెలిపారు. స్వచ్ఛతా బాధ్యతా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్ కార్పొరేషన్ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికుల సేవలకు గానూ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ కోరారు.

నర్సరీని సందర్శించిన మాజీ ఎంపీ

కడియం: రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ శనివారం మండలంలోని కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు స్వాగతం పలికి వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ మొక్కల కూర్పులను చూసి నర్సరీ రైతులను అభినందించారు. నర్సరీ రైతు పుల్లా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సేవింగ్స్ ఖాతాలకు ప్రత్యేక కౌంటర్

ప్రకాశం నగర్: ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకూ రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాల ప్రారంభ ప్రక్రియ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పోస్టల్ సూపరింటిండెంట్ పి.కోమల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాల శాఖ ఉత్తరాల బట్వాడాయే కాకుండా బ్యాకింగ్, బీమా, ఆధార్, పాస్‌పోర్ట్ వంటి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. సేవలను నగర వాసులు సద్వినియోగం చేసువాలని కోరారు.

కందుల దుర్గేష్‌కు సతీవియోగం

సీటీఆర్‌ఐ: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ భార్య ఉషారాణి (53) అనారోగ్యంతో హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. రాజమహేంద్రవరంలోని దుర్గేష్ నివాసం వద్ద బంధువులు, అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతిక కాయాన్ని ఆదివారం ఉంచుతారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆమె మరణానికి పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కాపులకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

సీటీఆర్‌ఐ: రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాపుల జనాభా దామాషా 27 శాతం ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు 75 అసెంబ్లీ, 8 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని కాపు నాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తాడివాక రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ ఎవరితో పొత్తు పెట్టుకున్నా అంతిమంగా కాపులకు రాజ్యాధికారం దక్కేలా కృషి చేయాలని సూచించారు. త్వరలో కాపునాడు పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి తిరుపతి కేంద్రంగా కార్యాచరణ చేసేందుకు చర్చలు ప్రారంభిస్తున్నట్టు వెల్లడిరచారు.

22న రాష్ట్రంలో సెలవు ప్రకటించాలి

సీటీఆర్‌ఐ: అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి విగ్రహప్రాణ ప్రతిష్ఠ జరిగే ఈనెల 22వ తేదీన రాష్ట్రంలో సెలవు ప్రకటించాలని పరవస్తు అరుఘయ మణవాళ జియ్యర్ స్వామివారి మఠాధిపతి, వరల్డ్ హిందూ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పాడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు (తాళ్లూరు మఠం), విశ్వ హిందు మహా సంఘ భారత్ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వామీజీ శనివారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో ధర్మ ప్రతిష్ఠాపన జరగాలని కోరుకుంటున్న 120 దేశాల ప్రతినిధులు ఆరోజున అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని హాజరవుతున్నారని, అలాంటి పవిత్రమైన శుభ సమయంలో ఆ రోజున రాష్ట్రంలో సెలవు ప్రకటించడం సముచితంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. లోకా సమస్త సుఖినోభవంతు అనే మన సనాతన ధర్మానికి ప్రతీక అని, ఇది మంచి కార్యక్రమమని వారు పేర్కొన్నారు.అవసరమైతే దీనిపై సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గణేష్

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడిలో విద్యుత్‌శాఖ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పసుపులేటి గణేష్ వైఎస్సార్ సీపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. శనివారం రాజ మహేంద్రవరంలోని రజక సామాజిక వర్గం భవనంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సభ్యులు సత్కరించారు.

భోగి భాగ్యాలతో...

- నగరంలో భోగి వేడుకలకు ఏర్పాట్లు
- ముక్కనుమ వరకూ పండగ సందడి



భోగి మంట వెలిగిస్తున్న ఎంపీ భరత్ తదితరులు



నగరంలో భోగి మంట వెలిగించిన దృశ్యం

సీటీఆర్‌ఐ: తెలుగువారి పండగల్లో పెద్ద పండగ సంక్రాంతి. ఈ పండగను జరుపుకోవడానికి నగర ప్రజలు సిద్ధమయ్యారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. సంక్రాంతి వేడుకలు భోగితో మొదలవుతాయి. ఈ భోగి పండగను నిర్వహించేందుకు యువత అన్ని సిద్ధం చేసుకున్నారు. ప్రతి సెంటర్‌లోనూ భోగి మంటను వేసి ఆవు పేడతో చేసిన పిడకలను వేస్తారు. ఆదివారం ఉదయమే చిన్నా పెద్దా భోగిపళ్లతో స్నానమాచరించి భోగిమంటలో పిడకలను వేసి నమస్కరిస్తారు. దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతాడు. దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం అవడం వల్ల భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు భగభగ మండే చలి మంటలు వేసుకుంటారు. ఉత్తరాయణం ముందు రోజు చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు మంటలు అందరూ వేస్తారు. ఇదీ సైన్స్ ప్రకారం జరుగుతుంది.

ప్రజల నమ్మకం

ప్రజలంతా బావుండాలనే మన సంప్రదాయ పండగల ముఖ్య ఉద్దేశం. సంక్రాంతి రోజు వివిధ పిండి వంటలు వండి ఇంటికి బంధువులను పిలిచి వారికి అతిథ్యమిస్తారు. ముఖ్యంగా సంక్రాంతికి అల్లుళ్ల అత్తారింటికి రావడం ఆచారంగా ఉంది. కొత్త పండక్కి అల్లుళ్లని పిలిచి దుస్తులు పెట్టడం మన సంప్రాదాయం. ఈ రోజు ఇంటి నిండా బంధువులు, పిల్లలతో సందడిగా ఉంటుంది.

42 డివిజన్‌లో సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి అంటే ఒక కొత్త మార్పుకు నాంది పలకడమని భావిస్తారు. జీవితంలో కొత్త దనానికి స్వాగతం పలుకుతామని.. అటువంటి సంక్రాంతి శోభ మన నగరంలో నిత్యం కనబడుతూనే ఉందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలో కొత్త కొత్త ఆవిష్కరణలతో సరికొత్త అందాలతో నగరం శోభాయమానంగా వెలుగొందుతోంది అన్నారు. శనివారం నగరంలోని 42వ డివిజన్‌లో మున్సిపల్ స్టేడియంలో టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి ఎంపీ భరత్, కళాశాల అధినేత టీకే విశ్వేశ్వరరెడ్డి భోగి మంటను వెలిగించారు. తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే భోగి పండ్లు వేడుక, గంగిరెద్దులు, హరిదాసులు, జోడెడ్ల బండ్లు, గుర్రపు స్వారీ, చిలక జోస్యం, విద్యార్థినులచే రంగవల్లుల పోటీ ఇలా సంక్రాంతి సంబరాలతో ఆ ప్రాంతమంతా పదహారణాల పల్లె ఆడపడుచుగా ముస్తాబై నగర వాసులను ఆకట్టుకుంది.



నగరంలో భోగి మంటలకు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న సంక్రాంతి సెట్

ఆలయంలో సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ తల్లి ఆలయం వద్ద సంక్రాంతి సంబరాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం భోగి పండగ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద భజన కార్యక్రమం, సోమవారం కచేరీ కార్యక్రమం, మంగళవారం అమ్మవారికి ఉయ్యాలసేవ, మధ్యాహ్నం అమ్మవారిని గరగనృత్యాలు, వివిధ ప్రోగ్రామ్‌లతో గ్రామోత్సవం నిర్వహించనున్నారు.



చీరలతో దోసాలమ్మ తల్లి

త్వరలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా..

రాజమహేంద్రవరం నగరంలో త్వరలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కు ఆఫ్ ఇండియా రాబోతోందని ఎంపీ భరత్ వెల్లడించారు. ఇందు కోసం బొమ్మూరు కలెక్టరేట్ సమీపంలో రెండెకరాల స్థలం శాంక్షన్ అయిందన్నారు. అధునాతనమైన భవన నిర్మితం కాబోతోందని చెప్పారు. అలాగే నగరంలోని గాంధీ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని, ఈ నెల 26న ఈ పార్కు ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. క్వారీ సెంటర్లో శ్రామిక భవనం, గోదావరి గట్టున పూలే అంబేడ్కర్ భవనాలకు శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. వీటిని కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్టు ఎంపీ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమండ్రి అర్బన్ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలా రెడ్డికి అభినందనలు



షర్మిలారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న హౌసింగ్ అధికారులు

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా మేడపాటి షర్మిలా రెడ్డి నియమించిన సందర్భంగా జిల్లాకి చెందిన హౌసింగ్ అధికారులు జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా షర్మిలా రెడ్డి మాట్లాడుతూ జిల్లాను హౌసింగ్ నిర్మాణాల పరిధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. చైర్ పర్సన్ షర్మిలారెడ్డిని కలిసి అభినందనలు తెలిపిన వారిలో హౌసింగ్ అధికారులు ఈఈలు రాజ్‌కుమార్, రాజమండ్రి రూరల్ డీఈ బీవీవీ సత్యనారాయణ మూర్తి, నిడదవోలు డీఈ చంద్రశేఖర్, డీఈ అనపర్తి డీసీహెచ్ వేణుగోపాల్, రాజానగరం డీఈ ఆర్.వెంకటేశ్వర బాబు, డీఈ కొవ్వూరు ఎం.శ్రీనివాస్, డీఈ గోపాలపురం కె.శేఖర్‌బాబు, ఏఈ కొవ్వూరు రూరల్ కేపీఎస్ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

గత వైభవాన్ని కాపాడే బాధ్యత అందరిదీ

- రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన, ఎంపీ మార్గాని
- ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రారంభం



ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రారంభిస్తున్న మంత్రి చెల్లుబోయిన, ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం గత వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం, అలనాటి చారిత్రక స్మృతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ నగర వాసులుగా ప్రతీ ఒక్కరిపైనా ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్వాతంత్ర్యోద్యమానికి కీలక వేదికగా నిలిచిన శ్రీ బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం మైదానం చారిత్రక నిర్మాణం (ఓపెన్‌ఎయిర్ థియేటర్)ను వారిరువురూ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి చెల్లుబోయిన మాట్లాడుతూ ఒక చారిత్రక ప్రాంతాన్ని కాపాడేందుకు కమిషనర్ దినేష్ కుమార్, ఎంపీ భరత్ చూపిన శ్రద్ధ నగర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. చారిత్రక ఆస్తి చరిత్ర ఎందరో త్యాగధనుల వల్ల మనకు సంక్రమించిందని, దీనిని భవిష్యత్తు తరాలకు చాలా జాగ్రత్తగా అందించాల్సిన బాధ్యత మనదేనన్నారు. తోలు బొమ్మలాట, హరికథ, బుర్రకథ తదితర కళారూపాలతో గత సాంస్కృతిక సంపదను ఈ సుబ్రహ్మణ్యం మైదానం వేదికగా కాపాడుకుంటే ఈ వేదిక చారిత్రక నిర్మాణం సార్థకమవుతుందన్నారు. నగరంలో చారిత్రక స్థలాల ఆనవాళ్ళు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను సేకరిస్తే వాటన్నిటినీ లఘు చిత్రాలుగా చిత్రీకరించి ప్రదర్శిస్తే విద్యార్థులకు, నగర వాసులకు ఈ నగర విశిష్టత, చరిత్ర అర్థమవుతుందన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ నగరానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. చారిత్రక స్థలాన్ని కొంతమంది అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా వాడుకుంటున్నారని ఈ స్థల చరిత్రను, పవిత్రతను కాపాడాలని కమిషనర్‌తో చర్చించగా ఆవిష్కృతమైనదే ఈ యాంఫీ థియేటరని అన్నారు. చారిత్రక ఆనవాళ్ళు ఏ మాత్రం చెక్కు చెదరకుండా మరింత శోభాయమానంగా తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం మనుమరాలు బాల సరస్వతి, కుటుంబ సభ్యులు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, కమిషనర్ దినేష్ కుమార్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులు విజేతలకు బహుమతులు

నగరంలోని 48వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో భారీ ఎత్తున వైఎస్సార్ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవానికి ఎంపీ భరత్‌రామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అందజేశారు.

శ్రీమహాలక్ష్మి అమ్మవారికి పూజలు

సీటీఆర్‌ఐ: గాడాలలోని శ్రీమహాలక్ష్మి సమేత శ్రీ చిన్న వేంకటేశ్వరస్వామివారి పీఠంలోని అమ్మవారిని ప్రముఖ సీనియర్ సినీనటుడు మొలేటి బాలాజీ(ఆంధ్రా రజినీకాంత్) శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీమాన్ డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలాజీ త్వరలో తన తీయబోయే కొత్త సినిమా స్క్రిప్టును అమ్మవారి పాదాల దగ్గర పెట్టి పూజలు నిర్వహించారు. సినిమా పేరుని 'త్రీ నేత్ర' అని వెల్లడించారు. ఈ ఆలయాన్ని దర్శించుకున్న వారికి సమస్త బాధలు తొలగుతాయని రాశులు, నక్షత్రాలతో కూడిన ఆలయం ఒక అద్భుతమైన దేవాలయమని విన్నానన్నారు. కాని ఇప్పుడు కళ్లారా చూస్తున్నానన్నారు. అనంతరం కొత్త సినిమా స్క్రిప్టును అమ్మవారి పాదాల దగ్గర ఉంచి పీఠాధిపతి శ్రీమాన్ డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మనగుడి-మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి చైర్మన్ ధరణికోట దుర్గావెంకట హేమావతి, జాతీయ కార్యదర్శి చవ్వాకుల శ్రీనివాసరావు, తోట మణి స్వరూప్, జాతీయ సంయుక్త కార్యదర్శి. టాటా సత్యనారాయణ, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ద్రాక్షారామ శ్రీ రాజరాజేశ్వరి పీఠాధిపతులు తాలూరి సాంబ శివరావుస్వామి రాష్ట్ర డైరెక్టర్ పడాల వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సినీ నటుడు బాలాజీని సత్కరిస్తున్న చిన్నవెంకన్నబాబు స్వామీజీ తదితరులు

సంప్రదాయ క్రీడలకే ప్రాధాన్యమివ్వాలి

జిల్లా ఎస్పీ జగదీష్

కడియం: చట్ట వ్యతిరేక క్రీడల జోలికి పోకుండా సంప్రదాయక ఆటలకే ప్రాధాన్యమివ్వాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ యువత క్రిమినల్ కేసుల్లో చిక్కుకుంటే వారి భవిష్యత్తే నాశనమవుతుందని, సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయక క్రీడల్లో మాత్రమే పాల్గొనాలని సూచించారు. 35కు పైగా జట్లు పాల్గొన్న ఈ పోటీలు లోకల్, నాన్ లోకల్ విభాగాలుగా నాలుగు కేటగిరీలుగా నిర్వహించారు. రెండు రోజుల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో నాన్‌లోకల్ విభాగంలో కాకినాడకు చెందిన బీజీ సాయి, పి. ప్రవీణ్ జట్టు, జి.సాయి మనీష్, ఎస్‌కే నవాబుల్లా, రాజమహేంద్రవరంకు చెందిన జీవీ చైతన్య, కె.చైతన్యల జట్లు విజయం సాధించాయి. లోకల్ విభాగంలో వేమగిరికి చెందిన నున్నా సూర్య, తోటస్వామి జట్టు, కడియపులంకకు చెందిన గోరుబాబు, సాయిల జట్టు, ధవళేశ్వరానికి చెందిన వెంకటల్, శ్రీధర్‌ల జట్టు, కడియం గ్రామానికి చెందిన అంజి, బాబీల జట్టు విజయం సాధించారు. విజేతలకు మొదటి బహుమతికి రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.6వేలు, షీల్డ్‌లను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, దక్షిణ మండలం డీఎస్పీ కె.శ్రీనివాసులు, ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్, కడియం ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్, కడియం ఎస్ఐ బాలాజీ సుందం, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా టోర్నీ నిర్వహణలో రిఫరీగా వ్యవహరించిన ఎస్‌వీ భద్రంను పోలీసు ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

నేటి నుంచి వీరుళ్లమ్మ జాతర

అనపర్తి: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అనపర్తి గ్రామ దేవత శ్రీవీరుళ్లమ్మ జాతరకు ముస్తాబైంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే జాతర ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు.

సినిమాలు



శ్యామల	:	సైంధవ్
సూర్యమినీ	:	నాసామిరంగా
సూర్యప్యాలెస్	:	గుంటూరు కారం
స్వామి	:	గుంటూరుకారం
శివజ్యోతి	:	సైంధవ్
అనుశ్రీ	:	హనుమాన్
రాజా	:	హనుమాన్
అశోక	:	సలార్
ఊర్వశి	:	గుంటూరుకారం
రంభ	:	నాసామిరంగా
మేనక	:	హనుమాన్
అప్సర	:	గుంటూరుకారం
కుమారి	:	గుంటూరుకారం
నామవరం వీఎస్.మహల్	:	సైంధవ్
ధవళేశ్వరం మురళీకృష్ణ	:	సైంధవ్, గుంటూరుకారం
కడియం వెంకటసూర్య	:	హనుమాన్,సైంధవ్

నర్సరీలో సంక్రాంతి లక్ష్మి



కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీ డాక్టర్ పుల్లా సత్యనారాయణ (చంటియ్య) నర్సరీలో ఈ సంవత్సరం మొదటి పండగ సంక్రాంతి సందర్భంగా మా నర్సరీలో పల్లె సంక్రాంతి లక్ష్మీ(పౌష్య లక్ష్మి) అనే కూర్పును ఏర్పాటు చేశారు. ఈ కూర్పులో పల్లెగుడిసె, లక్ష్మీదేవి, పాలకుండ, చెరుకు గడలు, కోడిపుంజుల ఆకారాలను తయారు చేశారు. ఈ కూర్పులో 15000 మొక్కలు, అనేక వేల పూలరేకలతో 2 రోజులు 10 మంది శ్రామికులు పనిచేసినట్టు తెలిపారు. రైతులకు, బంధుమిత్రులకు పుల్లా పెద్ద సత్యనారాయణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరంలో మద్యం విక్రయిస్తున్న నక్కా సూర్యచంద్రన్(పండు)ను శనివారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ తెలిపారు. అతని నుంచి 21 మద్యం బాటిల్స్(180 ఎంఎల్)ను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పాతనేరస్తులు ముగ్గురిపై బైండోవర్ నమోదు చేసి అర్బన్ తహసీల్దార్ హాజరపరిచామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పల్లెల్లో సంక్రాంతి శోభ

సీతానగరం: ఈ కొత్త ఏడాదిలో సంక్రాంతి పండగ సందర్భంగా అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకోని రాజానగరం నియోజకవర్గంలోని 90 గ్రామాల్లో జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం రఘుదేవపురంలో చిట్టూరి శ్రీనివాస్ వీధిలో హరిదాసు, గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, రంగవల్లుల ప్రత్యేక ఆకర్షణతో నిలిచిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని భోగి మంటలు వెలిగించారు. రాపాకలో జరిగిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి వాషింగ్ మెషీన్, రెండో బహుమతి మిక్సీ, మూడో బహుమతి డిన్నర్ సెట్‌లు, కన్సోలేషన్ బహుమతులు ఎమ్మెల్యే రాజా చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పండుగ సంక్రాంతి అనగానే మనకు మొదటి గుర్తుకొచ్చేది ముగ్గులని, అవి గ్రామాల్లో ఉండడం వల్ల సందడి నెలకొంటుందన్నారు. కొత్త ఏడాదిలో వచ్చే ఈ పండగ మీ అందరి జీవితాలలో కొత్త వెలుగులను నింపాలని కోరుకుంటూ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.



రాపాకలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో మధురపూడి, నర్సాపురం తదితర గ్రామాల్లో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వేసిన ముగ్గులను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరిశీలించారు.ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడాన్ని ఆమె అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.